ఆర్ అండ్ బీ రోడ్లపై ప్రయాణం నరకం

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

గుడివాడరూరల్: ప్రధాన రహదారుల్లో ప్రయాణం చేయాలంటే నరకం అనుభవించాల్సిందేనని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందివాడ మండలం పుట్టగుంట వంతెన నుంచి చేదుర్తిపాడు, ఒద్దులమెరక మీదుగా ఉంగుటూరు మండలానికి వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడి అధ్వానంగా మారింది. దాదాపు రెండు నుంచి మూడు కిలో మీటర్ల మేర రోడ్డు శిథిలావస్థకు చేరి ఆ రహదారి మీద ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందేనని వాహనదారులు అంటున్నారు. పగటి పూటే ఇలా ఉంటే రాత్రి సమయాల్లో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సిందేనని వాపోతున్నారు. తమిరిశ నుంచి పోలుకొండ వెళ్లే జీపీకే ఆర్అండ్ బీ రోడ్డు శిథిలమైంది. గుడివాడ నుంచి పోలుకొండ వరకు 13 కిలో మీటర్ల మేర ఉన్న రోడ్డును 7 కిలోమీటర్ల మేర నిర్మించి 6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ఆ రోడ్డు పరిస్థితి దయనీయంగా మారింది. పెద్ద పెద్ద గోతులు పడి రాళ్లు లేచి ప్రయాణాలకు వీలు లేకుండా ఉంది. వర్షాలు వస్తే రోడ్డు తటాకంలా మారి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తుంది. ఈ ప్రాంతంలో ఆక్వా సాగు అధికంగా ఉండటంతో ప్రతిరోజు వందల సంఖ్యలో భారీ వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. రోడ్డు బాగుండకపోవడం వలన ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వరదల వలన రోడ్డు పరిస్థితి జఠిలంగా మారింది. గుంతల వలన ద్విచక్ర వాహన చోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడటం పరిపాటిగా మారింది. రోడ్డు దెబ్బకు గుడివాడ నుంచి పాఠశాలలు, కళాశాలలకు వచ్చే బస్సులను సైతం యాజమాన్యాలు నిలుపుదల చేయడంతో పాఠశాలలకు వచ్చే విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. కుదరవల్లి నుంచి ఎల్ఎన్పురం, పోలుకొండ ఆర్అండ్బీ రహదారి వరదల దెబ్బకు రూపు కోల్పోయింది. 13 కిలో మీటర్ల మేర రోడ్డు ఎక్కడ చూసినా గోతులు, రాళ్లే దర్శనమిస్తున్నాయి. రోడ్డు కుంగిపోయి పక్కనున్న దోసపాడు చానల్ వైపు ఒరిగిపోవడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా పోలుకొండ నుంచి ఎల్ఎన్పురం వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత దిగజారడంతో ఆ రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. నందివాడ నుంచి తమిరిశ వెళ్లే రోడ్డు ఘోరంగా మారింది. రోడ్డు భారీగా దెబ్బతిని వాహన రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా పోయింది. ముఖ్యంగా మండల ప్రధాన కేంద్రానికి ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డు శిథిలమవ్వడంతో 10 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


గుంతలమయంగా ఉన్న ఒద్దులమెరక-పుట్టగుంట రహదారి


రాళ్లు లేచి కోతకు గురైన రామాపురం-అరిపిరాల ఆర్అండ్బీ రోడ్డు


ప్రమాదభరితంగా ఉన్న తమిరిశ-పోలుకొండ రోడ్డు

పట్టించుకోని అధికారులు...

రోడ్లు శిథిలమై ప్రయాణాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత ఆర్అండ్బీ శాఖ అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులు అయినా చేపడతారని ఆశించినా అటుగా చర్యలు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు పాడైతే తాత్కాలిక మరమ్మతులు చేపట్టడమే తప్ప రోడ్లను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్ల దెబ్బకు గ్రామాలను వదిలి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లను నిర్మించి పుణ్యం కట్టుకోవాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

నరకం అనుభవిస్తున్నాం...



ఒద్దుల మెరక నుంచి చేదుర్తిపాడు, ఉంగుటూరు, గన్నవరం గ్రామాలకు వెళ్లాలంటే ఈ రహదారిపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో ఏ గుంత ఎక్కడ ఉందో తెలియక వాహనాలను నడపాలంటే భయంగా ఉంది. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

–శంకర్, ఒద్దులమెరక

వాహనాలు నడపాలంటే భయం..భయం



కుదరవల్లి–ఇలపర్రు రోడ్డు అధ్వానంగా ఉండటం వలన ప్రయాణాలకు ఇబ్బంది పడుతున్నాం. ఈ రహదారిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిందే. రాత్రయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. రోడ్డు నిర్మించేలా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

–ఫణికుమార్, వాహనచోదకుడు

ముమ్మరంగా దాళ్వా సాగు

- వరినాట్ల పనుల్లో రైతులు బిజీ
- వెయ్యి ఎకరాలలో సాగుకు సన్నద్ధం

తోట్లవల్లూరు: దాళ్వా సాగు ముమ్మరంగా సాగుతోంది. రబీ సాగులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో రైతులు దాళ్వా సాగును చేపట్టారు. వరినారు అదనుకు రావటంతో వరినాట్ల పనుల్లో బిజీగా ఉన్నారు. వివరాల్లోకి వెళితే..తోట్లవల్లూరు మండలంలో దాళ్వా సాగును రైతులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. రొయ్యూరు, వల్లూరుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక, యాకమూరు తదితర గ్రామాల్లో దాళ్వా సాగు చేపట్టారు. కాలువల ద్వారా సాగునీటి సరఫరా లేకున్నప్పటికీ విద్యుత్ బోర్ల ద్వారా నీటి అవకాశం ఉన్న రైతులు దాళ్వా సాగుకు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం సుమారు 800 నుంచి వెయ్యి ఎకరాలలో ఈ ఏడాది దాళ్వా పంట సాగయ్యే అవకాశం ఉంది.

నారుమడులు కళకళ..

దాళ్వా సాగు కోసం రైతులు ఏర్పాటు చేసిన వరి నారుమడులు అదనుకు వచ్చాయి. ఏపుగా ఎదిగి పచ్చగా కళకళలాడుతుడున్నాయి. ఈ ఏడాది వరి నారు కోసం ఎక్కువగా 1010 రకం వంగడాలను రైతులు వినియోగించారు. వరినారు సిద్ధం కావటంతో రైతులు మాగాణి పొలాలను శుభ్రం చేసి, ట్రాక్టర్తో దమ్ము చేయించి, గట్లను పటిష్టం చేసే పనిలో నిమగ్నమయ్యారు.


వల్లూరుపాలెంలో అదునుకు వచ్చిన వరి నారుమడి

ఊపందుకున్న వరినాట్లు..

వరినాట్లు ఊపందుకుంటున్నాయి. వరినారు అదనుకు రావటంతో వరినాట్లపై రైతులు దృష్టి సారించారు. ఇప్పటికే పలువురు రైతులు నాట్లు వేయించగా, మిగిలిన రైతులు కూడా నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఎకరం పొలం వరినాట్లు వేసేందుకు వలసకూలీలు రూ.4500 తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. స్థానికంగా కూలీల కొరత ఉండటంతో వలస కూలీలతోనే నాట్లు వేయిస్తున్నామని అంటున్నారు.

వరినారు అదునుకు వచ్చింది



నాకు ఎనభై సెంట్ల మాగాణి పొలం ఉంది. చుట్టు పక్కల రైతులంతా దాళ్వా సాగు చేపట్టడంతో, నేను కూడా దాళ్వా సాగు చేపట్టాను. దాళ్వా వేసేందుకు ఏర్పాటు చేసిన వరి నారుమడి అదనుకు వచ్చింది. దాళ్వా దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నాను.

–చింతపల్లి బాబూరావు, రైతు, వల్లూరుపాలెం

సాగు పెరుగుతోంది



దాళ్వా సాగు ప్రతి ఏటా క్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాల వరకు దాళ్వా పంట సాగయ్యే అవకాశం ఉంది. బోర్ల ద్వారా సాగునీటి అవకాశం ఉన్న రైతులు దాళ్వా సాగు పట్ల మొగ్గు చూపుతున్నారు.

–జి.నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి, తోట్లవల్లూరు

క్లుప్తంగా

కొండలమ్మను దర్శించుకున్న జడ్జి శిరీష



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని గన్నవరం జూనియర్ సివిల్ జడ్జి బి. శిరీష ఆదివారం దర్శించుకున్నారు. ఆమెను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు దుశ్శాలువాతో గౌరవించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత ఆమె పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను చేశారు. ఏఎస్ఐ సారథి, ఆలయ అర్చకుడు శివ సంతోష్ ఉన్నారు.

మరీదుకు మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ



తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్కుమార్ అన్నారు. మండలంలోని వల్లూరుపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న మరీదు వెంకటేశ్వరరావును ఆదివారం ఆయన పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను తెలుసుకోవటంతో పాటు ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ నాయకులు చింతలపూడి గవాస్కర్రాజు, బడుగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

545 మందికి వైద్య పరీక్షలు



గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ఆదివారం ఉచిత కార్పొరేట్ వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 545 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరితిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి హోమియో వైద్యురాలు పి.భవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాద్కు చెందిన డాక్టర్ హరిహర్ వైద్య సేవలను అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

మార్చి 3 నుంచి జాతర మహోత్సవాలు

పామర్రు: మార్చి నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గంగానమ్మ తల్లి ఆలయ జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు 3వ తేదీ సోమవారం నుంచి గ్రామంలో అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని, చివరి రోజు 9వ తేదీ ఆదివారం ఆలయంలో అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకోవడంతో జాతర పూర్తవుతుందని పేర్కొన్నారు.

అడ్డాడలో సామూహిక అక్షరాభ్యాసం

అడ్డాడ(పామర్రు): మండలంలోని శ్రీ అరవింద హైస్కూల్లో సోమవారం వసంత పంచమి సందర్భంగా పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరుగుతుందని ప్రిన్సిపాల్ వెంకట రమణమూర్తి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో అర్చన చేసిన కుంకుమతో సరస్వతీ అష్టోత్తర పూజ చేయించడం జరుగుతుందని అన్నారు. ఉదయం 9.45 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం జరుగుతుందన్నారు. పాఠశాలలో సరస్వతీ మంత్ర ప్రయుక్త గాయత్రీ హోమం, పూర్ణాహుతి, శ్రీ సరస్వతీ అష్టోత్తర, అక్షర స్వీకార కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. శిశువుల ప్రదర్శన, ప్రవచనం, శిశువులతో తరగతి గది ప్రవేశం చేయించుట, శిశువాటిక ప్రదర్శనశాల సందర్శన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

వీధికుక్కల పట్టివేత

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల పట్టివేతకు పంచాయతీ పాలకవర్గ సభ్యులు చర్యలు చేపట్టారు. పెరిగిన కుక్కల బెడదతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ప్రజలు చేసిన ఫిర్యాదుల మేరకు గ్రామాల్లో చర్యలు చేపట్టారు. మచిలీపట్నం నుంచి వచ్చిన కుక్కల వేటగాళ్ల బృందం ఉచ్చులు వేసి కుక్కలను బంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక వాహనంలో మచిలీపట్నం ప్రాంతంలోని మడ అడవుల్లో విడిచిపెట్టారు. వైవాకలో 122, ఊటుకూరులో 102, దేవపూడిలో 30 వీధి కుక్కలను పట్టివేసి మడ అడవుల్లో విడిచిపెట్టారు.

సరస్వతీదేవి విగ్రహానికి విశేషాభిషేకాలు


సరస్వతీ దేవి విగ్రహానికి అభిషేకాలు చేస్తున్న వేద పండితులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులోని శ్రీమద్గంగా పార్వతీదేవి సమేత సిద్దేశ్వరాలయంలో పంచలోహ సరస్వతీ దేవి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్టించనున్నారు. ఆదివారం ఆ విగ్రహానికి వేద పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి ఈ పూజల్లో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం


పీహెచ్సీకి నిర్మించిన సీసీ రోడ్డు

మండవల్లి: మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రహదారి నిర్మించారు. గతంలో రహదారి ఉన్నప్పటికీ సుమారు 10 మీటర్ల దూరం రహదారి సౌకర్యం లేక ఆస్పత్రికి వెళ్లే రోగులు, పీహెచ్సీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షం కురిస్తే మరిన్ని అవస్థలు తప్పేవి కావు. ఈ నేపథ్యంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించడంతో సీసీ రోడ్డు నిర్మించారు. దీంతో పీహెచ్సీకి రహదారి సమస్యలు తీరాయి.

ఎన్నికల కోడ్ వర్తించదా..?


యాకమూరు-గరికపర్రు రోడ్డు మలుపు వద్ద దర్శనమిస్తున్న టీడీపీ ఫ్లెక్సీ

తోట్లవల్లూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుపై అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీ బ్యానర్ల తొలగింపులో చూపిన ఉత్సాహం, అధికార పార్టీ బ్యానర్ల తొలగింపులో కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి. మండలంలోని యాకమూరు–గరికపర్రు మలుపు వద్ద, గరికపర్రు ప్రధాన రహదారిలో ఎక్కడ చూసినా అధికార పార్టీకి చెందిన పసుపు బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. అధికారులు ఇప్పటికై నా స్పందించి ఎన్నికల కోడ్ను సక్రమంగా అమలు చేయాలని, అన్ని పార్టీలను ఒకే రీతిన చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పోటెత్తిన భక్తులు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో వచ్చిన భక్తులు పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డీఎన్నార్ను కలిసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు



కైకలూరు: నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన పలువురు ఆదివారం వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ సెల్ విభాగ అధ్యక్షుడు ఉచ్చుల చిన్నరాజు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు కూర్మా నిహేమియా, మేధావుల ఫోరం అధ్యక్షుడు పండు ఆనంద రవిరాజు, ఐటీ విభాగ అధ్యక్షుడు బొద్దుల శ్యాంబాబు(చిన్నూ), సోషల్ మీడియా విభాగ అధ్యక్షుడు మండా నవీన్ డీఎన్నార్ను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో కై కలూరు మండల కో ఆప్షన్ సభ్యుడు సోమల శ్యామసుందర్, ఎంపీటీసీ పండు గాంధీ, వైఎస్సార్ సీపీ నాయకులు బొడవల అప్పయ్య, కాకర్ల పేతురు, నోవాహు, లేళ్ళ ప్రభుదాస్, ఆల రాంబాబు, మేగడ బాబి, గంగుల రాజేంద్రప్రసాద్, గుజ్జుల యాకోబు, యాళ్ళ కృష్ణ, ఉచ్చుల విజయ్, మత్తే రాము, జంగం చిన్ని, జంగం విన్నీ, పెనుగొండ పండు, గొల్ల అరుణ్, గాతాల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పుల్లేటి కాల్వలో గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్

గుడ్లవల్లేరు: కౌతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలోని పుల్లేటి కాల్వలో ఎట్టకేలకు గుర్రపు డెక్క, వ్యర్థాల తొలగింపు చర్యలను ఆదివారం చేపట్టారు. 'అడుగడుగునా అడ్డంకులే' అన్న శీర్షికన 'సాక్షి'లో శనివారం కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన కౌతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ లాకు సూపరింటెండెంట్ దావీదు ఈ తొలగింపు చర్యలను చేపట్టారు.

కొండలమ్మకు మొక్కుబడుల చెల్లింపు


పాల పొంగళ్లు పొంగిస్తున్న మహిళా భక్తులు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తులు తమ తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆదివారం అధికసంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యం

గుడ్లవల్లేరు: ఎస్సీ వర్గీకరణ సాధించటమే తమ లక్ష్యమని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీ బుల్లా త్యాగరాజు(కింగ్) అన్నారు. గుడ్లవల్లేరులో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ వచ్చిన సందర్భంగా ఆయనకు జేజేలు పలుకుతూ ఆదివారం రాత్రి బుల్లా కింగ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు రాయల్ ప్రభాకర్, శ్రీకాంత్, సురేంద్ర, రాఘవ, వస్కుల రవి, జుజ్జువరపు నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



గుడివాడటౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్లోని ప్రభావతి గార్డెన్స్లో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య సిబ్బందితో ఈ వైద్యపరీక్షలు నిర్వహించారు. మొత్తం 94 మందికి గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, ఎముకలు, నరాలు తదితర వ్యాధులపై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాయినాథ్, డాక్టర్ ఐ.లావణ్య, డాక్టర్ కె.ధనుష్, డాక్టర్ వి.మానస్వి, రోటరీక్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్బాబు, పూర్వ అధ్యక్షుడు పి.రామకృష్ణ, బి.శంకరరావు, క్లబ్ సభ్యులు ఎ.మహదేవ్ దేశాయ్, ఎస్.ఉదయ్ భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్కుమార్

పామర్రు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, అప్పుడే సమాజం సస్యశ్యామలంగా ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్కుమార్ అన్నారు. స్థానిక వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయాన్ని దర్శించుకుని విశేషంగా పూజలను చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలతో పాటు పుష్పాభిషేకం చేసి నీరాజన మంత్రపుష్పాలతో ప్రత్యేకంగా పూజలు జరిపించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలకు నిర్వహిస్తున్న వార్షికోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనటం అభినందనీయమని అన్నారు. అందరూ భక్తి భావనను పెంపొందించుకుని శాంతి కాముకులుగా జీవించాలని కోరారు. గత మూడు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవ కార్యక్రమాలు నేటితో ముగిశాయని అన్నారు. అనంతరం అమ్మ వారి గ్రామోత్సవంలో అనిల్కుమార్ పాల్గొన్నారు. తదుపరి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, తోట్లవల్లూరు జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మోరా వెంకటరెడ్డి, పంచకర్ల సందీప్, ఆలయ కమిటీ సభ్యులు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, బొమ్మారెడ్డి లక్ష్మీరెడ్డి, బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్కుమార్

చెరువులకు తాగునీరు విడుదల

ముదినేపల్లి రూరల్: మండలంలో పంచాయతీల ఆధ్వర్యంలోని తాగునీటి చెరువులు నింపుకొనేందుకు పంట కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. క్యాంప్బెల్, పోల్రాజ్ ప్రధాన కాలువల నుంచి బ్రాంచి కాలువల ద్వారా తాగునీటి చెరువులు నింపాల్సి ఉంది. అందుకోసం క్యాంప్బెల్ కెనాల్కు 200 క్యూసెక్కులు, పోల్రాజ్ కెనాల్కు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ కాలువల ద్వారా ప్రవహిస్తున్న నీటిని పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్ల సమన్వయంతో ఇంజిన్లు ఏర్పాటుచేసి తాగునీటి చెరువులను నింపుకోవాలని ఆయా కాలువల ఏడీలు తెలిపారు. కొద్దిరోజులు మాత్రమే నీటి ప్రవాహం ఉంటుందని కాలువలు కట్టివేసిన అనంతరం ఏప్రిల్లో మాత్రమే తిరిగి నీటిని విడుదల చేస్తారని తెలిపారు. మినుము పైరుకు ఈ నీటిని మళ్లించరాదని తాగునీటి అవసరాలు తీరిన తరువాత మాత్రమే పైరుకు నీరు పెట్టుకోవచ్చని ఇందుకు రైతులు సహకరించాలని నీటిపారుదల శాఖ ఏఈలు సిద్ధార్థ, వీవీ కిషోర్ కోరారు.

చిత్తడి నేలలను రక్షిద్దాం

జిల్లా అటవీశాఖ అధికారి విజయ

కై కలూరు: చిత్తడి నేలల పరిరక్షణకు అందరూ బాధ్యతగా మెలగాలని ఏలూరు జిల్లా అటవీశాఖ అధికారి బి.విజయ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆటపాక పక్షుల కేంద్రంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముసునూరు మండలం చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులు పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. అటవీశాఖ అధికారి విజయ మాట్లాడుతూ చిత్తడి నేలలు జీవ వైవిధ్యం, పర్యావరణాన్ని కాపాడడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఎన్నో జీవరాశులకు, మొక్కలకు చిత్తడి నేలలు ఆవాసంగా ఉంటూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నాయని అన్నారు. సముద్ర తీర ప్రాంతంలో మాంగ్రూవ్ మొక్కల పెరుగుదలకు, పక్షుల పెరుగుదలకు చిత్తడి నేలలు ప్రధాన కారణమన్నారు. డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ రంజిత్ కుమార్ కొల్లేరు భౌగోళిక పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్ బాఖరీ, ఉపాధ్యాయులు పద్మకిషోర్, పద్మలత, యోగిత వింధ్య, కిరణ్మయి పాల్గొన్నారు.


ఆటపాక పక్షుల కేంద్రంలో విద్యార్థుల ర్యాలీ

7 నుంచి సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యన్నారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాలను ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఆదివారం ఆ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి రంగులను వేయిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం చలువ పందిరిని కూడా వేయించామని నిర్వాహకులు నరేష్, రవి తెలిపారు.